క్లుప్తంగా

ఇంట్లోకి చొరబడి వ్యక్తిపై దాడి

నెల్లూరు(క్రైమ్): ఇంట్లో నిద్రిస్తున్న వ్యక్తిపై అకారణంగా ఇద్దరు యువకులు కర్ర, రాడ్డుతో దాడి చేశారు. అనంతరం అతన్ని ఈడ్చుకుంటూ తీసుకెళ్తుండగా బాధితుడు వారినుంచి తప్పించుకుని పరారయ్యారు. ఈ ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. మూలాపేట ఇరుగాళమ్మ సంఘంలో బి.అశోక్ నివాసం ఉంటున్నారు. ఆయనకు భార్య, పిల్లలున్నారు. అశోక్ ఆర్టీసీ బస్టాండ్‌లోని న్యూడిల్స్ షాపులో మాస్టర్‌గా పనిచేస్తుండగా, అతని భార్య చేపల మార్కెట్‌లో పనిచేస్తున్నారు. ఆదివారం రాత్రి కరెంట్ లేని కారణంగా అశోక్ తలుపు తీసి ఇంట్లో పడుకుని ఉండగా అతని భార్య పిల్లలను తీసుకుని ఇరుగాళమ్మ గుడి వద్ద పడుకునేందుకు వెళ్లారు. అర్ధరాత్రి అశోక్ ఇంట్లోకి రాజేష్, బుడ్డా అనే ఇద్దరు యువకులు అక్రమంగా ప్రవేశించారు. తమ వెంట తెచ్చుకున్న కర్ర, రాడ్డుతో అశోక్‌పై దాడిచేశారు. ఎందుకు కొడుతున్నారని ప్రశ్నించినా యువకులు వినిపించుకోలేదు. అశోక్‌ను ఇంట్లో నుంచి ఈడ్చుకుంటూ బయటకు తీసుకొచ్చి దాడి చేస్తుండగా ఆయన తప్పించుకుని పరారయ్యారు. ఓ చెట్టు కింద పడిపోయారు. సోమవారం తలకు తీవ్రగాయాలతో పడి ఉన్న ఆయన్ను భార్య చికిత్స నిమిత్తం హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. ఈ మేరకు బాధితుడు చిన్న బజారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. దాడికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

ఫీజుల దోపిడీపై చర్యలకు వినతి

నెల్లూరు(అర్బన్): జిల్లాలోని కార్పొరేట్, ప్రైవేటు విద్యాలయాల ఫీజుల దోపిడీపై చర్యలు తీసుకోవాలని బీసీ విద్యార్థి, యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ మురళీకృష్ణ యాదవ్ కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డీఆర్వో ఉదయభాస్కర్‌రావుకు సంఘ కార్యకర్తలు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ యాదవ్ మాట్లాడుతూ ఫీజుల దోపిడీపై అధికారులతో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసి విచారణ జరిపించాలని కోరారు. ప్రైవేటు పాఠశాలల్లో ఎల్‌కేజీ విద్యకు కూడా రూ.25 వేలు, కార్పొరేట్ పాఠశాలల్లో రూ.35 వేల నుంచి 40 వేల వరకు వసూలు చేస్తున్నారన్నారు. సీబీఎస్‌ఈ సిలబస్ పాఠశాలలో రూ.65 వేలు వసూలు చేస్తున్నారన్నారు. హైలెవల్ కార్పొరేట్ స్కూల్లో ఎల్‌కేజీ విద్యకు కూడా రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నారన్నారు. అలాగే బుక్స్, యూనిఫాం పేరుతో మరో రూ.10 వేలు అదనంగా వసూలు చేస్తున్నారన్నారు. ఇలా అడ్డగోలు దోపిడీపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా విద్యార్థి సంఘం నాయకులు మహేష్‌రాజు, ప్రశాంత్‌యాదవ్, సుధీర్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆశా పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ఇందుకూరుపేట: మైపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మైపాడు సచివాలయం -1లో ఖాళీగా ఉన్న ఆశా వర్కర్ పోస్టు కోసం దరఖాస్తులు చేసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ శ్రావణి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించి 25 నుంచి 45 ఏళ్లలోపు వారు అర్హులని చెప్పారు. ఆసక్తి కలిగిన వారు ఈనెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వైభవంగా రథోత్సవం



విడవలూరు: రామతీర్థంలోని కామాక్షి సమేత రామలింగేశ్వరుని దేవస్థానంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రథోత్సవం వైభవంగా జరిగింది. తొలుత రథాన్ని, దేవుని విగ్రహాన్ని పూలతో అందంగా ముస్తాబు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రథానికి కట్టిన తాడును లాగుతూ హరహర శివనామ స్మరణతో పులకించిపోయారు. కాగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎస్సై పి.నరేష్ బందోబస్త్ ఏర్పాటు చేయగా, ఆలయ ఈఓ మల్లికార్జునరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ బెల్లంకొండ వెంకటేశ్వర్లు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమానికి శంభుని కాపుల సంఘం వారు, తంబి శ్రీనివాసులు ఉభయకర్తలుగా వ్యవహరించగా, ఆలయ చైర్మన్ అత్తిరాల సురేష్ పాల్గొన్నారు.

చికెన్ వ్యర్థాల వాహనాల పట్టివేత

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న మూడు వాహనాలను సోమవారం తెల్లవారుజామున కాగులపాడు, దామరమడుగు వద్ద పోలీసులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై సంతోష్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో ఇష్టారాజ్యంగా చికెన్ వ్యర్థాలు తరలిస్తున్నారన్న సమాచారంతో దామరమడుగు, కాగులపాడు తదితర ప్రాంతాల్లో తమ సిబ్బందితో నిఘా ఉంచామన్నారు. తనిఖీలు నిర్వహించగా ఏచర్, ఆటో, బొలెరో వాహనాల్లోని 45 డ్రమ్ముల చికెన్ వ్యర్థాలు తరలిస్తుండటంతో వాటిని సీజ్ చేశామన్నారు. వ్యర్థాలను మత్స్యశాఖ అధికారి పొట్టెయ్య ఆధ్వర్యంలో పూడ్చివేశామని వివరించారు.

దిగ్విజయంగా 'యువత పోరు'

- కూటమి మోసాలను ఎండగడుతూ సాగిన నిరసన



భారీ జనసందోహం మధ్య కలెక్టరేట్‌కు వస్తున్న యువకులు

వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో తలపెట్టిన యువత పోరు సోమవారం నెల్లూరు నగరంలో దిగ్విజయంగా సాగింది. యువకులతో పాటు అన్నివర్గాల ప్రజలు తరలివచ్చి సంఘీభావం తెలిపారు. కూటమి ప్రభుత్వ మోసాలను తీవ్రస్థాయిలో ఎండగట్టారు. ఎంతో ఆర్భాటంగా ప్రకటించిన నిరుద్యోగ భృతి, ఏడాదికి ఐదు లక్షల ఉద్యోగాలు ఏమైందని ప్రశ్నించారు. ఏటా ఠంచన్‌గా వచ్చే ఫీజు రీయింబర్స్‌మెంట్, జాబ్ క్యాలెండర్ తదితర హామీలను కూటమి ప్రభుత్వం నీరుగార్చిందని మండిపడ్డారు. యువకులను మోసం చేసిన కూటమి నాయకులకు తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కాగా యువత ర్యాలీ నగరంలోని పాత జెడ్పీ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు భారీ జనసందోహం మధ్య ఉత్సాహంగా సాగింది. పలువురు రిక్షాలు తొక్కుతూ.. ప్లకార్డులు ప్రదర్శిస్తూ వినూత్నంగా నిరసన తెలిపారు. కాగా పలుచోట్ల పోలీసులు యువకులను అడ్డుకునే ప్రయత్నం చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



రిక్షా తొక్కుతూ వినూత్న నిరసన



కలెక్టరేట్ ఆవరణలో కూటమి మోసాలను ఎండగడుతున్న యువకులు



పాత జెడ్పీ కార్యాలయం వద్ద యువకులను అడ్డుకుంటున్న పోలీసులు

12న 'పెరసం' పురస్కారాల ప్రదానం

నెల్లూరు(బృందావనం): పెన్నా రచయితల సంఘం (పెరసం) 16వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని 2023–24 సంవత్సరానికి సంబంధించి నిర్వహించిన కవితా సంపుటి పోటీల్లో విజేతలకు జూలై 12వ తేదీన పురస్కారాలు అందజేయనున్నట్లు ఆ సంఘ అధ్యక్షురాలు గోవిందరాజు సుభద్రాదేవి సోమవారం తెలిపారు. ఈ పోటీల్లో విజయనగరం జిల్లా మెంటాడ గ్రామానికి చెందిన పాయల మురళీకృష్ణ కవితా సంపుటి 'గచ్చెం సెట్టుకి అటూ ఇటూ', కాకినాడ జిల్లా జగ్గంపేటకు చెందిన మిరప మహేష్ కవితా సంపుటి 'పడమటీది నాటకం'లకు లభించినట్లు ఆమె తెలిపారు. వీరికి పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్లో పురస్కారాల ప్రదానం ఉంటుందన్నారు.

శ్యామా ప్రసాద్ ముఖర్జీకి నివాళి

నెల్లూరురూరల్: జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఆదర్శప్రాయులు అని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరి అన్నారు. ముత్తుకూరు బస్టాండ్ సెంటర్‌లో ఆటో కార్మికుల ఆధ్వర్యంలో శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఖ్యాతిని కొనియాడారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు కాయల బాలకృష్ణ, జనార్దన్, జోసఫ్, జైపాల్, శ్రీనాథ్, శేషయ్య, సుబ్బారావు, ఐశ్వర్య సాయి తదితరులు పాల్గొన్నారు.

సుందరేశ్వరుని సన్నిధిలో ప్రదోషకాల పూజలు



ప్రదోషకాల పూజలను జరిపిస్తున్న అర్చకుడు

నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి దేవస్థానం ప్రాంగణంలో ఉన్న మీనాక్షి సుందరేశ్వరస్వామి ఆలయంలో సోమవారం త్రయోదశి సందర్భంగా ప్రదోషకాల పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో కొలువైన నందీశ్వర మీనాక్షి సుందరేశ్వరస్వామికి తొలుత అభిషేక పూజార్చనలు విశేషంగా జరిపించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

రాజరాజేశ్వరి అమ్మవారి సన్నిధిలో నిర్వహించే నిత్య అన్నదాన పథకానికి పి.వెంకటేశ్వర్లురెడ్డి–ప్రణీత దంపతులు రూ.1,00,116లను అందజేశారు. ఈ మేరకు ఆలయంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి కోవూరు జనార్దన్‌రెడ్డికి చెక్కు రూపంలో అందజేశారు.



అన్నదాన పథకానికి విరాళం అందజేత

పెద్దాస్పత్రి క్యాజువాలిటీకి ముగ్గురు డాక్టర్లు

నెల్లూరు(అర్బన్): నగరంలోని సర్వజన ఆస్పత్రి క్యాజువాలిటీ(అత్యవసర విభాగం)కి ముగ్గురు డాక్టర్లను ప్రభుత్వం నియమించింది. అనంతపురం జిల్లాలో పనిచేస్తున్న డాక్టర్ పఠాన్ చాంద్ బేగం, నెల్లూరు జిల్లా లింగసముద్రం పీహెచ్‌సీలో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా పనిచేస్తున్న డాక్టర్ కొండపల్లి అనూరాధ, కరేడు పీహెచ్‌సీలో పనిచేస్తున్న మరో సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ టి.రమ్యజ్యోతిలను ప్రభుత్వం నియమించడంతో వారు సోమవారం సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ సిద్ధానాయక్‌కు తమ నియామక పత్రాలను అందించి విధుల్లో చేరారు. ఇప్పటి వరకు క్యాజువాలిటీలో డాక్టర్ల కొరత ఉండేది. వీరు రావడంతో ఈ కొరత తీరనుందని సూపరింటెండెంట్ తెలిపారు.



సూపరింటెండెంట్‌కు నియామక ఉత్తర్వులు అందజేస్తున్న డాక్టర్లు

జీతాలకు ఇబ్బందుల్లేకుండా చూడాలి

నెల్లూరు (టౌన్): ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులను సర్దుబాటు చేసినందు వల్ల ఈనెల జీతాలకు ఇబ్బంది లేకుండా చూడాలని మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా నాయకులు కోరారు. ఈ మేరకు స్థానిక జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈఓ బాలాజీరావును కలిసి సోమవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వీఆర్ మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుల పోస్టులను మంజూరు చేయాలన్నారు. ఈ విషయాలపై డీఈఓ సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు.



డీఈఓకు వినతిపత్రం అందజేత

పట్టా స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయడం లేదు

నెల్లూరు(అర్బన్): తనకు చెందిన పట్టా స్థలంలో కొంత భాగాన్ని తన కుమార్తెకు రాసిచ్చినప్పటికీ రిజిస్ట్రేషన్ చేయకుండా అడ్డుకున్నారంటూ నగరంలోని శ్రీనివాసనగర్–మైపాడు గేటు ప్రాంతానికి చెందిన నెట్టం పద్మమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఆమె కలెక్టరేట్‌లో డీఆర్వో ఉదయభాస్కర్‌రావుకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన భర్త 13 ఏళ్ల క్రితం మృతి చెందాడన్నారు. తనకున్న పదిహేడున్నర అంకణాల స్థలంలో తన కుమార్తెకు తొమ్మిది అంకణాలను మూడేళ్ల క్రితం రాసిచ్చానన్నారు. అప్పటి రిజిస్ట్రార్ విజయరాణి వద్దకు వెళ్లి ఈ స్థలాన్ని తన కుమార్తెకు రిజిస్ట్రేషన్ చేయాలని దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. అయితే రాత్రి నా కుమారుడు అడ్డు తగిలాడంటూ రిజిస్ట్రేషన్‌ను ఆన్‌లైన్‌లో నమోదు చేయకుండా ఆమె ఆపేశారన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు తిరుగుతున్నా న్యాయం జరగలేదన్నారు. మూడు నెలల క్రితం అమరావతికి వెళ్లి మంత్రి లోకేష్‌కు చెప్పుకున్నానన్నారు. ఇప్పటికైనా రిజిస్ట్రేషన్ జరిగేలా చర్యలు తీసుకోవాలని డీఆర్వోను కోరారు.



మాట్లాడుతున్న పద్మమ్మ

నేత్రదానం



మాటూరు వనజ(ఫైల్)

నెల్లూరు(అర్బన్): నగరంలోని వెంగళరావు నగర్ బి బ్లాక్‌కు చెందిన మాటూరు వనజ (52) స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో మృతిచెందారు. ఈ క్రమంలో ఆమె నేత్రాలను కుటుంబ సభ్యులు అరుణకుమార్, రాజేశ్వరి, విజయదుర్గలు ప్రభుత్వ వైద్యశాలకు దానం చేశారు. మృతురాలి నేత్రాలను ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి టెక్నీషియన్ సునీల్ సోమవారం సేకరించారు. కుటుంబ సభ్యులకు నేత్రదాన సర్టిఫికెట్‌ను అందించారు. ఈ సందర్భంగా టెక్నీషియన్ సునీల్ మాట్లాడుతూ నేత్రదానం చేయదలచిన వారు 99595 89321 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

శంకరమఠంలో రుద్రహోమం రేపు

నెల్లూరు(బృందావనం): జ్యేష్ఠ అమావాస్య సందర్భంగా మూలాపేట శంకరమఠం ప్రాంగణంలోని కామాక్షి సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో బుధవారం ఉదయం 8 గంటల నుంచి 'మహా మృత్యుంజయ అమృత పాశుపత రుద్ర హోమం' జరుగనుందని మఠం నిర్వాహకులు కొడ్రపాటి నందకిశోర్– ఉషాకుమారి దంపతులు సోమవారం తెలిపారు. ఈ హోమంలో పాల్గొనదలచిన వారు తమ గోత్రనామాల నమోదు, వివరాల కోసం 96528 60264, 99499 18358 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

ఉంగరం, కమ్మలు చోరీ

నెల్లూరు(క్రైమ్): బీరువాలోని ఉంగరం, కమ్మలు చోరీకి గురైన ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు.. నగరంలోని విరాట్‌నగర్‌లో ప్రదీప్ కుటుంబం నివాసం ఉంటోంది. ఆయన ఈనెల 8న కుటుంబంతో కలిసి తన అక్క ఇంటి గృహ ప్రవేశ నిమిత్తం పరమేశ్వరీ నగర్‌కు వెళ్లారు. ఈ క్రమంలో ఇంటి తాళాన్ని గ్రిల్స్ పక్కనే ఉన్న మగ్గులో ఉంచారు. సాయంత్రం ఇంటికి వచ్చి బీరువాను తెరచి చూడగా అందులో ఉన్న తొమ్మిది గ్రాముల కమ్మలు, ఉంగరం కనిపించలేదు. ఈమేరకు బాధితుడు సోమవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీసీ డ్రెయిన్ల ప్రారంభం

నెల్లూరు సిటీ: రూరల్ నియోజకవర్గంలోని 26వ డివిజన్ ఉడ్ కాంప్లెక్స్‌లో రూ.1.50 కోట్లతో నిర్మించిన సీసీ డ్రెయిన్లను రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో నగర్ తరహాలో ఉడ్ కాంప్లెక్స్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుల విచారణ

పొదలకూరు: మండలంలోని ఆర్‌వైపాళెం, చెన్నారెడ్డిపల్లి గ్రామాలకు చెందిన వారి ఫిర్యాదు మేరకు నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను సోమవారం నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు విచారించారు. ఆర్‌వైపాళెం గ్రామ సచివాలయంలో మహిళా పోలీస్‌గా పనిచేస్తూ బదిలీ అయిన కృష్ణవేణి అదే గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లురెడ్డి వేధింపులకు గురిచేస్తున్నాడని గతనెలలో ఫిర్యాదు చేయడంతో పోలీసులు అట్రాసిటీ కేసును నమోదు చేశారు. చెన్నారెడ్డిపల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు అదే గ్రామానికి చెందిన పెంచలరెడ్డి కాలువ నీటిని పెట్టుకునే విషయంలో గొడవ పడి దాడి చేసి గాయపరిచినట్లు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. ఈ రెండు కేసులను డీఎస్పీ ఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. డీఎస్పీ వెంట పొదలకూరు ఎస్సై ఎస్‌కే హనీఫ్ ఉన్నారు.

భవన నిర్మాణాలను పరిశీలించండి

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో నూతనంగా నిర్మిస్తున్న భవన నిర్మాణాలు అనుమతుల మేరకే నిర్మిస్తున్నారా.. లేదా? అని పరిశీలించాలని కమిషనర్ వైఓ నందన్ టౌన్ ప్లానింగ్ అధికారులు, సచివాలయ కార్యదర్శులకు సూచించారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక ఆచారి వీధి, కలెక్టరేట్, కర్ణాలమిట్ట, ములుముడి బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న కాలువల పూడికతీత, సిల్ట్ ఎత్తివేత పనులను కమిషనర్ సోమవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిబంధనలు ఉల్లంఘించి ఎవరైనా భవన నిర్మాణాలు చేపడితే ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఎస్ఎంసీ పరిధిలో జరుగుతున్న కాలువల పూడికతీత పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టి, సిల్ట్ ఎత్తివేత క్రమం తప్పకుండా చేపట్టాలని శానిటేషన్ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం స్వర్ణాల చెరువు గణేష్ ఘాట్‌ను తనిఖీ చేశారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలు చేస్తున్న కమిషనర్ నందన్

గడువులోగా సమస్యలకు పరిష్కారం



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ నందన్

నెల్లూరు(బారకాసు): ప్రజలు వస్తున్న సమస్యలు పునరావృతం కాకుండా, నిర్దేశిత గడువులోగా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ వైఓ నందన్ పేర్కొన్నారు. ఎస్ఎంసీ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి కమిషనర్ అర్జీలు స్వీకరించి అధికారులతో మాట్లాడుతూ ప్రజల నుంచి అందే అర్జీల్లో వెంటనే పరిష్కారం చేయగలిగినవి, కొంత సమయం తర్వాత చేయగలిగినవి ఇలా వేర్వేరుగా లిస్టు తయారు చేయాలని చెప్పారు. అర్జీల పరిష్కారానికి విభాగాధిపతులే క్షేత్రస్థాయిలో పరిశీలనకు వెళ్లాలన్నారు. అర్జీల పరిష్కార పురోగతిపై కమిషనర్ చాంబర్‌కు ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, రోడ్ల ఆక్రమణ వంటి సమస్యల పరిష్కారం కోసం ప్రజలు నగరపాలక సంస్థ కార్యాలయానికి వస్తున్నారని, అవి స్థానికంగానే పరిష్కారం చేయాలన్నారు. ప్రజల నుంచి అందే అర్జీలు, ఫిర్యాదుల నమోదుకు ప్రతి విభాగంలో సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో సిబ్బందిని కేటాయించి, ప్రత్యేకంగా రిజిస్టర్ ఏర్పాటు చేయాలని కోరారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలు అకౌంట్ సెక్షన్‌కు 2, ఆప్కాస్‌కు 4, ఇంజినీరింగ్ విభాగానికి 9, టిడ్కో హౌసింగ్‌కు 30, రెవెన్యూ విభాగానికి 7, టౌన్‌ప్లానింగ్‌కు 14, పబ్లిక్ హెల్త్‌కు 3, పెన్షన్‌కు సంబంధించి ఒకటి చొప్పున మొత్తం 70 ఫిర్యాదులు అందాయని కమిషనర్ వెల్లడించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఎస్ఈ రామ్మోహన్‌రావు, సిటీప్లానర్ హిమబిందు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ చైతన్య, మేనేజర్ రాజేశ్వరి, ఆర్వోలు శ్రీనివాసులు, సమ్మద్‌తో పాటు వివిధ విభాగాల సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ–శ్రమ రిజిస్ట్రేషన్‌పై అవగాహన

నెల్లూరు(బారకాసు): పట్టణ ప్రాంతాల్లో పనిచేస్తున్న అసంఘటిత రంగ కార్మికులైన వారికి ఈ–శ్రమ రిజిస్ట్రేషన్ చేయాలని, ఈ మేరకు వారికి గుర్తింపు కార్డులు మంజూరు చేయించాలని ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.లీలారాణి పేర్కొన్నారు. నగరంలోని మెప్మా పీడీ కార్యాలయంలో ఈ–శ్రమ రిజిస్ట్రేషన్‌పై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ–శ్రమ రిజిస్ట్రేషన్ ఎలా చేయాలి.. ఎవరికి చేయాలి, దీనివల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం బయోమెట్రిక్ మెషీన్లను అందజేశారు.

అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకోండి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని అక్రమ లేఅవుట్లపై అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య డిమాండ్ చేశారు. నగరంలోని ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం సీపీఐ నాయకులతో కలిసి ఏఓ సదానందకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రెవెన్యూ శాఖ పరిధిలోని ఆక్రమిత భూములను వెనక్కి తీసుకుని నిరుపేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్ల భూమిని కేటాయిస్తామని హామీ ఇచ్చిందన్నారు. అయితే నగరంలోని ఒకటి నుంచి 12వ డివిజన్ వరకు ప్రభుత్వ భూములను ఇష్టానుసారంగా ఆక్రమించి అక్రమ లేఅవుట్‌లు వేశారని ఆరోపించారు. దీనిపై గతంలో కలెక్టర్, ఆర్డీఓ, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు అక్రమ లేఅవుట్‌లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు షాన్‌వాజ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రమణయ్య, నాయకులు సుబ్బరాయుడు, శిరీషా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి అంకయ్య